# అబ్బాయి - నాన్న

"చెప్పండి...మరి!"

"ఏమిటి?"

"చందమామను...చంద్రుణ్ణి, మామ అని అందుకు పిలవడం?"

"ఏమో"

"ఓస్...ఇంతేనా..."

"ఐతే, చెప్పనా..."

"ఆఁ..."

"నీవు ఒప్పుకుంటావా?"

"ముందు చెప్పండి. గెలువలేక..."

"నీలాటి చక్కని చుక్కలు కూతుళ్ళుండటంచేత..."

"సంతోషించారు తెలివికి, తమరెవరో అప్పుడు?"

"మేం లక్ష్మీపుత్రులం!"

"ఓహో...అదా సంగతి! రోజా తోటలో పూలన్నీ మాయమౌతూంటే...ఏమై పోతున్నాయా అనుకుంటున్నా. ఎవరిమీద ప్రయోగించడానికేం బాణాసంచాంతా?"

"అదికాదండి...నాకు తెలుసులే...దేవిగారికి తల జార, దండలు అమరటంలేదని గునుపు."

"పోనీ తీసుకోండి మీ క్రాపింగు...లో...కి..."

"నవ్వు...అలాగే...నవ్వితే నేనూరుకోను..."

"ఐతే కోపం తెప్పించుకుంటా...ఇదుగో, బుంగమూతి పెడుతున్నా...వచ్చేసింది... ఉహ్ఁ"

"ఇదుగో...ఓయ్!...ఊ!...పలకవూ? ఏమిటి నిజంగా కోపం వచ్చినట్లేనా? ఉహుఁ! అలా అయితే నేను ఒప్పుకోను. అన్నింటికి ఓమాదిరిగానే తల ఊగిస్తే ఏలా? కోపం రాలేదా? వచ్చిందా? వచ్చిందీ? సై... ఇక కాచుకో, చక్కలిగింత పెట్టనా—నవ్వకూడదు-ఏం...సరేనా?"

*　　*　　*　　*

"ఏమి టా కిచకిచలు? ఇంకా మేలుకునే ఉన్నారా?"

"......................."

"వినబడుతూనేఉందిలే నవ్వు. మీరు మాట్లాడకపోయినా—"

"ఇక చాలించండి, ప్రొద్దుపోయింది. అమ్మాయి! ఇక పడుకో అమ్మా!

ఓపలేనిపిల్లవు. ఒళ్ళు భారకిస్తుంది. వాడికేంలే? అలవాటేగా తెల్లవార్లూ మేలుకోవడం!"

* * * *

"చెపుతే విన నేర్పులే దేంచేతునమ్మా? వాడు వాడే; అది అదే...ఇదుగోనర్రా! ఇక నేనూరుకోను."

"...మరే...అమ్మమ్మా..."

"కాదండీ...అమ్మమ్మగారూ...ఈయనే..."

"చూడవే...న...వ్వి...స్తూ...ది...నే...ను..."

* * * *

"మీ యిష్టం మీది నాయనా...ఉండండి, మెట్లగదిలోకి వెళ్ళి పెద్దమీట వేసేస్తా...దీపాలున్నంతవరకూ—"

* * * *

"అమ్మమ్మా! వెన్నెల్లో నీ మనుమరాలే..."

"ఊఁ! అఘోరించండి... మీ యిల్లు బంగారంగానూ"

## 2

"చూడండి..."

—మిమ్మల్నే..."

—అక్కడకాదు—ఈలా రండి..."

—అబ్బ! రండి...ఇంతలో మరేం అరిగిపోరు..."

—ఓ! పిలిచినకొద్దీ బిగింపు ఎక్కువౌతూాందేం? మిమ్మల్ని ఎవరూ కొరుక్కు తినరులెండి—రద్దురూ..."

"ఎందుకూ?"

"...అలా చూడరేం. పాప పిలుస్తున్నాడు..."

"ఆ... నీ అంతవాడే...తక్కువా ఏం?"

"కాదండీ...మీ అంతవాడు. మీ గుణాలన్నీ అప్పుడే అబ్బినాయ్. అనుక్షణం అనుసరించి ఉండాలికద... ఓస్!...లేదమ్మ! మా నాన్న! మా బంగారుతండ్రి! నిన్ను కాదమ్మ! అబ్బ! ఎంత రోషమొచ్చిందో! ఒక్కమారు తీసుకోండి. ఏలా చేతులు చాస్తున్నాడో..."

—కే. ఆ.వు....కే...వు...కే...వుం...గా ఆ...

"పోనీలెండి...తెలియడంలా? వాడిభాషలో 'నన్నెత్తుకోవు?...'అని ఏలా పిలుస్తున్నాడో..."

"...ఇంతమాత్రం కవిత్వం నాకూ చేతనవును. 'నీవు పనికిరావు...అమ్మ'వుకావు... అంటున్నాడు, సరేనా..."

"మహా నేర్చారులెండి మాటలు..."

"మాట..."

"......................"

"పాపని...అమ్మమ్మకు యిచ్చి--"

--ఏం?

--వినిపించలా?

--ఏమిటి?

"నాకు తెలియదు బాబూ! అవిడకిస్తే వాడూరుకోడు...పనివేళప్పుడు--"

"అలాగైతే..."

"వాణ్ణి చూడండి...ఉహూఁ అంటున్నాడు. వల్లకాదు..."

"ఉహూ...నేనూ అంటా వల్ల కాదని..."

"మీ అమ్మమ్మదగ్గర పోయి కూర్చుంటా!!"

## 3

"అమ్మాయ్!...అదేమిటే? అలా మాటిమాటికీ తొట్టె కుదుపుతూంటే మళ్ళా మేలుకుంటున్నాడు? అసలే కొంటెకోణంగి. పోనీ, కాస్సేపు కాళ్ళమీద వేసుకుని చిచ్చిగొట్టు...అంత ఎగరేయకు, ఉలికిపడతాడు...ఒక్క పావుగంట ఆడించు. నేను మడివిడిచి ఇవతలకు వచ్చి తీసుకుంటా-..."

* * * *

"ఇంకా, పడుకోలా వాడు?"

"ఉహూఁ. ష్. బిగ్గరగా అనకండి...ఇప్పుడే కాస్త కునుకుతున్నాడు...మళ్ళా లేస్తే నన్ను వేపుకుతింటాడు..."

"వీడొకడు...దొరికాడు..."

"......................"

"నిజంగానే వెన్నెలరాత్రుల్లో ఎంత హాయిగా ఉండేవాళ్ళం? ఇప్పుడు --"

"అఁ...మీకు ఎప్పుడూ అదే రంధి..."

"అవును...నా ఆనందానికి అనుభవానికి అడ్డం గొట్టడానికి పుట్టాడు, వీడు..."

"ఏమిటా మాటలు?--"

"ఏమిటా...నీతో మాట్లాడటానికైనా నాకు ఇప్పుడు స్వతంత్రంలేదు. బిగ్గరగా పిలువకూడదు. అబ్బాయి ఉలికిపడతాడు. బిగ్గరగా నడవకూడదు. ఆయన మేలుకుంటాడు. నీవు నాతో కాస్సేపు తీరికగా ఉండకూడదు. ఆ మహారాజాధిరాజు పోరు మొదలెడుతాడు. ఐతే, నేను ఇక ఇంట్లోనూ ఉండకూడదు, అలాగైతే?"

"ఎక్కడ నేర్చుకున్నారు ఈ పాఠమంతా? మీకే ఉన్నారా మహా పిల్లలు? గాలికి తిరిగివచ్చి కబుర్లు చెప్పడానికే మీకు యింత కష్టమైతే, అస్తమానం కనిపెట్టుకుని కూర్చునేదానికి నాకు ఏలా ఉంటుంది?... ఐనా మనపిల్లవాడికి మనం చేసుకోవడం అబ్బురమా? ఒకరికి మెప్పా? వాడుమాత్రం అందరిపిల్లలలాగా విసిగిస్తాడా?"

"వెనుక వేసుకువస్తున్నావ్! అవును, నీకు వాడితోనే లోకం. నా మాట--"

"అ...మీ మాట...మీరు చెప్పేమాట ఏమిటో నాకు తెలుసు. కొత్తా?"

"ఊం వీడిమూలానే నాకు నీవు దూరమౌతున్నావ్. ఐనావు. ఎందుకు పుట్టాలీ...వీడు?"

*　　　*　　　*

"వింటున్నా మీ చిలుకపలుకులు, మహా లక్షణంగా ఉన్నాయ్...."

"కాదే అమ్మమ్మా!..."

"చూడండి! వాళ్ళఅబ్బాయితో యుద్ధంచేస్తున్నారు."

"అవును..వాడు ఎందుకుపుట్టాలి?..."

"అలాగేం? నాగన్నా! నీవు ఎందుకుపుట్టావు?"

"మా అమ్మ కన్నది..."

"మీ అమ్మ కంటే మాత్రం, నువ్వు ఎందుకు పుట్టడానికి ఒప్పుకున్నావూ? నిన్ను కాకపోతే ఇంకొకడ్ని కనేది. కడుపుతూన్నమ్మ కనక మానుతుందా? వండుకున్నమ్మ తినక మానుతుందా?"

"ఏం...?"

"................"

"జవాబు చెప్పవేం? ఇందాకనుంచీ నోరులేని పసికుంక వాడిమీద ఎగిరావ్... చెప్పమరి?"

*　　　*　　　*　　　*

"మీరూ...మీ వేషాలూనూ. ఎత్తుకో...ఓమారు ఎత్తుకు తిప్పు. ఎందరు ఎత్తుకోందీ ఇంతవాడవైనావ్? నేనూ బతికుంటే చూడకపోతానటలే? వాడూ రేపు ఈపాటికి బతికి బట్టకడితే వాడి పెళ్ళాందగ్గిరా ఈలాగే ధీమాకులు చేస్తాడు. అప్పుడు మనవణ్ణి నీవే ఎత్తుకు మోయాలి. చాల్లే;- ఇక ఈలా తే...ఈ నిమిషానికే పండుతండ్రిని పిసిగేశావ్. ఈకాలంవాళ్ళకు...ఏదీ తెలియదు. అదేంలోకమో? పోన్లే నాయనా! నీవు నాదగ్గిరే పడుకుందువుకాని. మీ అమ్మను నాయన్నీ గంతులేసుకోమను. ఇదుగోనే అమ్మాయి...! నవ్వొస్తే అపుకోవాలికాని - విరగబడుతూ, పరిగెత్తితే ఎలాగే? ఒక్కమారు వీణ్ణి తీసుకో...."

★ ★ ★